భర్త పాపాల్లో భాగం పంచుకోకూడదనుకున్న ఆమె ఆశ ఫలించిందా?

# వాల్మీకి భార్య

పాలంకి సత్య
కథ

వాల్మీకి మహర్షి మీద హరికథ చూపిస్తున్నారు టి.వి.లో వంటింట్లో కాఫీ కలుపుతున్న సుమతికి కథ వినిపిస్తోంది సప్తర్షుల ఆదేశాన్ననుసరించి ఇంటికి వచ్చిన బోయవాడు భార్యను పాపం పంచుకుంటావా అని అడిగేడు. ఆమె నీ ఆర్జనలోనే కానీ నీ పాపంలో వాటా అక్కర్లేదంది. ఎంత తప్పు ఆమెది అనుకుంది సుమతి. భర్త సంపాదనే కానీ అతని కష్ట నష్టాలు తనవికాదు అని ఏ భార్యా అనుకోకూడదు. తను అలాగే ఉంటోంది. భర్త బాధ్యతలన్నీ నవ్వుతో స్వీకరిస్తోంది. తన పుట్టింటి వాళ్ళకి తనంటే కోపం కూడాను. మొన్న వెళ్ళినప్పుడు అన్నయ్య అన్న మాటలామెకి జ్ఞాపకం వచ్చేయి.

"పెద్ద గవర్నమెంటు కార్పొరేషన్‌లో డివిజనల్ మేనేజర్ రాంకులో ఉన్నాడు. మంచి చదువు, పెద్ద ఉద్యోగం అనుకుని నిన్నిచ్చి పెళ్ళి చేశాము. ఎంతో హోదాతో మహారాణిలా ఉంటావనుకున్నాము. మట్టా అందరికీ చాకిరితోటే నీ బతుకు తెల్లారి పోతోంది".

అన్నయ్య మాటలు తల్చుకుని నవ్వుకుంది సుమతి. ఇప్పుడు మాత్రం తనకేమిటి తక్కువ? ఇంట్లో అనుక్షణం ముగ్గురు పన్వాళ్లు పనికి ఉన్నారు. కావల్సినవన్నీ వాళ్ళే కొనితెస్తారు. ఆఫీసు జీపు, డ్రైవరు ఉన్నారు వంటింట్లో అన్ని సదుపాయాలూ ఉన్నాయి. టి.వి, విసిఆర్, స్టీరియో ఉన్నాయి. తనకేం తక్కువ? అన్నయ్య అనవసరంగా బాధ పడతాడు పదవీ, డబ్బూ ఉంటే పనిమీద పదిమంది వస్తారు, పోతారు. ఆ



మాత్రానికే బాధపడితే ఎలా? "అన్నీ ఉన్నాయంటున్నావు. ఏనాడైనా నువ్వూ, నీ భర్తా కలిసి పది నిముషాలైనా టివి చూశారా? ఈ వస్తువులన్నీ నువ్వేనాడైనా అనుభవించేవా? కష్టాలే పంచుకుంటున్నావు" అన్న అంతరాత్మను నొక్కేసింది సుమతి. కాఫీలు పట్టుకుని డ్రాయింగురూంలోకి వచ్చింది. చక్కెర కావాలి, అసలు వద్దు, ఎక్కువ

కావాలి అన్న అందరి మాటలూ జ్ఞాపకం పెట్టుకుని ఎవరి కాఫీ వారికిచ్చింది.

"అమ్మాయ్ ఈ రాత్రి నేను భోజనం చెయ్యను. ఫలహారమే చేస్తాను".

"వదినా నాకు సంతోషీ మాతా వ్రతం. పులుపు తినను తెలుసుగా" అందరి ఆదేశాలూ విని వంటింట్లోకి వెళ్ళిపోయింది. టి.విలో ఏడుగంటలకి అందరూ సీరియల్ డ్రామా చూస్తున్నారు. ఎవరికి కావల్సినవి వాళ్ళకి వండి పెడుతోంది సుమతి. అందరి భోజనాలయ్యేసరికి వచ్చాడు ఆమె భర్త కళ్యాణ్ . ఇద్దరికీ వడ్డించింది సుమతి. అతనేదో ఆలోచనలో ఉన్నట్లున్నాడు. ఏదో ఆఫీస్ ప్రాబ్లం ఉండి ఉంటుంది అని పలకరించలేదు సుమతి. భోజనాలయ్యేక టేబులు దగ్గర ఆఫీసుఫైల్సు పెట్టుకుని కూచున్నాడతను.

"ఏమిటండీ పగలు ఆఫీసులో పనిచేసి అలసిపోయివస్తారు. మళ్ళీ రాత్రి కూడా పనిచేస్తే ఎలా? మీ ఆరోగ్యం పాడయిపోదా?"

"రేపు రంగనాథం బాబాయి వాళ్ళు శ్రీశైలం చూడాలనుకున్నారు. వాళ్ళకి కారు అరేంజి చెయ్యడంతో ఈ రోజు ఆఫీసులో పనిచెయ్యడం కుదర్లేదు. ఈ ఫైల్సు రేపటికి పంపించెయ్యాలి. నువ్వెళ్ళి పడుకో."

ఆమెకి బంధువర్గంమీద కోపం వచ్చింది

వచ్చినవాళ్ళు వాళ్ళ పని చూసుకుని వెళ్ళచ్చుకదా ఎలాగూ ఉపకారాలు పొందుతూనే ఉన్నారు. ఇంకా ఇలాంటి సరదాలకి కూడా ఆయన్ని అడగాలా? అసలందరూ ఎందుకు వచ్చారో ఆమెకి జ్ఞాపకం వచ్చింది. భర్త పనిచేస్తున్న కార్పొరేషన్లో వందకి పైగా ఖాళీలు నింపుతున్నారు. ఉద్యోగుల సెలెక్షన్ కమిటీకి తన భర్తే చెయిర్మెన్. దేశంలో నిరుద్యోగుల సంఖ్య తెల్సిందే కదా. ఇంక అందరూ తన భర్త చుట్టూ తిరిగేవారే. అందరూ వచ్చి అభ్యర్థిస్తూంటే తనకెంతో గర్వంగా అన్పిస్తుంది. కానీ ఉద్యోగాలు మెరిట్ మీద ఇవ్వాలి కాని ఇలా రికమెండేషన్స్ మీద కాదు గదా. ఆ మాటే భర్త నడిగింది సుమతి.

"మెరిట్ మీద ప్రపంచ మెక్కడ నడుస్తోంది సుమతీ. ఈ వంద ఉద్యోగాలలో ఎన్ని మంత్రుల కాండిడేట్సుకి, ఎన్ని మా కార్పొరేషన్ చెయిర్మెన్ గారి కాండిడేట్సుకి వెడుతున్నాయో తెలుసా? మనం ఇచ్చేదెంతమందికని? చిన్నప్పుడు మా నాన్నగారు పోయి మేం కష్టాల్లో ఉన్నప్పుడు వీళ్ళంతా మాకెంత సాయం చేశారో? ఈ నాడది నేను మర్చిపోను".

సుమతికి అతని వాదం నచ్చలేదు. అయినా ఆమె అతనితో ఏం మాట్లాడలేదు. ఒక్కో ఉద్యోగం నలభై, యాభైవేలదాకా అమ్మేస్తున్నారని పుకార్లు గుసగుసలాడుకోడం ఆమె వింది. అందులో తన భర్తకి వాటా ఉందా? ఎందుకో తన భర్త అవినీతికి పాల్పడతాడని ఆమె అనుకోలేకపోయింది.

మర్నాటి నుంచీ వచ్చిపోయే వాళ్ళ తాకిడి ఇంకా ఎక్కువైంది. మామిడి పళ్ళ బుట్టలతో, స్వీట్ల పాకెట్లతో చాలామంది కళ్యాణ్ దర్శనం చేసుకుంటూండేవారు. ఈ హడావుడిలో సుమతి నలిగిపోయింది.

ఇంట్లో కళ్యాణ్ కనబడితే చాలు బంధువర్గమంతా ఉద్యోగాల విషయమే మాట్లాడుతున్నారు.

అందరూ ఎదురుచూసిన రిక్రూట్‌మెంటు మొదలయింది. ఇంటర్వ్యూలవుతున్నాయి. నామమాత్రంగా నడుస్తాయని ఎంత తెలిసినా మెరిట్ కాండిడేట్లు కూడా చాలా మందే వచ్చారెందుకనో. మానవుడు ఆశావాది అన్న దానికి తార్కాణం కాబోలు. కమిటీలో ఒకతను కళ్యాణ్ కి సహోద్యోగి, మంచి స్నేహితుడు కూడా. రెండవ వాడు జూనియర్. ఇదివరలో కళ్యాణ్ సహాయం తీసుకున్నవాడే. మాటకాదనడు. ఆ ధైర్యం మీదనే 'ఇంటర్వ్యూలయ్యేక కళ్యాణ్ ఒక్కడే సెలక్టయిన వారి లిస్టు తయారు చేశాడు. ఆ రాత్రి అతన్ని వాళ్ళ బాబయ్య అడిగేడు.

"అబ్బాయ్ , ఉద్యోగాలిచ్చే వాళ్ళ లిస్టు రెడీ చేశావుటకదా".

"అవును బాబాయ్ , మన రఘు పేరుందిలే అందులో".

"ఉందనుకో ..." మాట నాన్చేడు.

"మరింకేమిటి బాబాయ్ ".

"అదే... లిస్టులో పేరు ముందుంటే బాగుండునని అబ్బాయి అనుకుంటున్నాడు. తర్వాత ప్రమోషన్‌కి పనికొస్తుందిట కదా"

"దాందేముందిలే అలాగే చేద్దాం".

"నేను రేపు ప్రొద్దుటే బయల్దేరతాను. అమ్మాయ్ , అన్నపూర్ణలా ఆదరించేవమ్మా. ఇదిగో తీసుకో!

కంచి పట్టుచీర నాలుగువేలకి తక్కువుండదు. సుమతి ఆయనకేసి మొహమాటంగా, కళ్యాణ్ కేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"తీసుకో బాబయ్య అభిమానంగా ఇస్తున్నాడు".

ఆయన వెళ్ళేక **కళ్యాణ్** సుమతిని కళ్ళు మూసుకోమన్నాడు. మెడ వెనక అతని చేతులు తగిలేయి. కళ్ళు తెరిచేసరికి రవ్వల నెక్లేసు కన్పించింది. భయంతో ఆమె వణికింది.



''ఎక్కడిదీ నెక్లేసు?''

''ఎక్కడిదేమిటి నా ప్రేమకానుక. ఇదిగో ఉంగరం, బ్రేస్‌లెట్, దుద్దులు. నా ప్రేమ కానుకను నాకోసమిలా ఏకాంతంలో నే పెట్టుకో. పెళ్ళిళ్ళకీ వాటికీ వద్దు. ప్రమాదం''.

ప్రమాదం ఎవరికి నా ప్రాణానికా, మీ ఉద్యోగానికా అని సుమతి అడగలేదు. పంద ఉద్యోగాలుట. ఉద్యోగానికెంతో ఆమెకి ఆనందంగా అన్పించలేదు.

మర్నాడు లిస్టులో పేర్లు చాలామందివే ఆర్డరు మారేయి. కళ్యాణ కి త్వరలో ట్రాన్స్ఫర్ ఆర్డర్లు రావచ్చని ఎవరో ఉప్పందించేరు. వెళ్ళేలోగా ఈ పని పూర్తవాలని మిగతా ఇద్దరి సంతకాలు తరువాత తీసుకోవచ్చులే అని అతను లిస్టు రిలీజ్ చేసేశాడు.

అతను చేసినపని మరీ అసాధారణమైనదేమీ కాదు. పని త్వరగా నడవాల్సి వచ్చినప్పుడు ముందు ఆర్డర్ రిలీజ్ చేసి సంతకాలు తర్వాత పెట్టించుకోవడం మామూలే. కానీ అసాధారణమైన దొక్కటే జరిగింది. మామూలుగా మెరిట్ ఉన్నచోట ఉత్తర, దక్షిణాలుండవు. అవి ఇవ్వగలిగినవాళ్ళకి మెరిట్ ఉండదు. ఈ సారి లిస్టులో రెండూ ఉన్న వాడొకడున్నాడు. అతని పేరు లిస్టులో అతననుకున్న దానికన్నా వెనక పడింది. విషయం మొత్తం బయటపడింది. పేపర్లలో తాటికాయలంత అక్షరాలతో వార్త పడింది. కళ్యాణ్ చేతిలో సస్పెన్షన్ ఆర్డరు పడింది.

కమిటీలో మిగతా ఇద్దరూ సెలెక్షన్ ఏకపక్ష నిర్ణయంగా జరిగిందన్నారు. చెయిర్‌మెన్‌దే తప్పంతా అన్నారు. ఆదుకుంటారనుకున్నవారంతా ముఖం చాటేశారు. ఇంట్లో ఉన్న బంధువులంతా ''ఛఛ ఇలాంటి వాడు అనుకోలేదమ్మా'' అంటూ వెళ్ళిపోయారు.

సుమతి కళ్యాణ్ ని ఓదార్చింది. ''సస్పెండు అయితే అంతా అయిపోయినట్లేనా? మనం మనవైపు విషయం చెప్పుకుందాం. న్యాయం మనవైపే ఉంటే మనమే నెగ్గుతాం''.

కేసు వివరాలు మొత్తం చెప్పి, వచ్చే నోటీసులకి సరైన రిప్లయి రాయడానికి మంచి లాయర్ని కుదుర్చుకుందుకు కళ్యాణ్ ని తీసికెళ్ళింది సుమతి. లాయర్ ఫీజు వినగానే అవాక్కయిపోయింది. జీతం పూర్తిగా రావడంలేదు. ఇంటికొచ్చాక కళ్యాణ్ ని డబ్బు విషయం అడిగింది. ఇన్నాళ్లుగా ఆమెకు ఆస్తి వివరాలేం తెలియవు. ఆస్తి చాలా మటుకు బేనామీ ట్రాన్సాక్షన్సులో ఉంది. ప్రస్తుతం రెడీగా కేష్ లేదు.

కళ్యాణ్ మెంటల్లీ డిప్రెస్డ్ అయిపోయాడు. అతన్ని బాగా పేరున్న సైకియాట్రిస్టు దగ్గరకు వైద్యంకోసం తీసికెళ్ళింది. లాయరుకీ, డాక్టరుకీ ఫీజుకోసం రవ్వల నెక్లేసు అన్నీ అమ్మేసింది.

లాయరు రిప్లయి రాసిచ్చి సుమతికి వివరాలు చెప్పేడు.

''కేవలం మా రిప్లయిల వల్ల పనులు జరగవు. మీరు పై ఆఫీసర్లకీ, మంత్రిగారికీ అందరికీ ముడుపులు చెల్లించాల్సిందే. నాకు తెలిసి ఇట్లాంటి పైరవీలు చేసేవాడున్నాడు. పరిచయం చేస్తాను. మీవారి కేసు క్లియర్ అయ్యేలా చూస్తాడు. ఇంతకన్నా పెద్ద

అన్యాయాల కేసులే మట్టికొట్టుకుపోయాయి. డోన్ట్‌వర్రీ. డబ్బు మాత్రం రెడీ చేసుకోండి".

డబ్బెలా రెడీ చెయ్యాలో సుమతికి అర్థం కాలేదు. కళ్యాణ్తో మాట్లాడ్డానికి లేదు. అతనీ విషయం ఎత్తేసరికి బావురుమంటున్నాడు. తన అన్నయ్య శేఖర్ దగ్గరకు వెళ్ళింది.

"కొద్దిగా డబ్బు కావాలన్నయ్యా. పెళ్ళిలో మీరిచ్చిన బంగారం అమ్మేద్దామనుకుంటున్నాను. మీకు చెప్పి చెయ్యడం భావ్యమనిపించింది.

శేఖర్ సుమతితో "ఆదేంటమ్మా బంగారం అమ్మడం దేనికి ఏదైనా అవసరముంటే నేనిస్తాగా" అన్నాడు.

"కొంచెం కాదన్నయ్యా ఈ కేసు విషయంలో ముట్టచెప్పడానిక్కావాలి".

"అయితే — మీ ఆయనేం చేస్తున్నాడు?"

"ఈ వ్యవహారం ఆయన మనస్సుని దెబ్బతీసింది. ఏమీ ఆలోచించ లేకపోతున్నారు. ఏపనీ చెయ్యలేకపోతున్నారు".

"ఏం అంతగా లంచాలు తీసుకుంటున్నప్పుడు తెలియరేదా? పని ఎగ్గొట్టడానికి ఇదో పద్ధతి అతనే చూసుకుంటాడులే. పోతేపోనీ ఉద్యోగం. నీకున్న నాలుగెకరాలతో పల్లెటూళ్ళో పోయి బతకండి".

"అన్నయ్యా, ఆయన నా భర్త. ఆయనకు ఉద్యోగం పోతే ఆ అవమానం నాది కాదా? సుఖం పంచుకుని కష్టాల్లో వదిలెయ్యమంటావా?"

"సుమతీ, సినిమాలు చూసి ఆ డైలాగులు జీర్ణించుకుని పాడైపోయావు. నిజంగా అతనికి కష్టమొస్తే వదిలెయ్యమంటానా? కానీ తప్పును రైటు చెయ్యడానికి చూడకు"

"మంచైనా, చెడైనా ఆయన నా భర్త. ఆయన కష్ట సుఖాలే నావి".

"నీకు సుమతి అని పేరు పెట్టడం తప్పైపోయింది. మొగుణ్ణి వేశ్య దగ్గరకు



## మూడుమూళ్ళు!

విద్యార్థిని కోపంగా తిట్టాడు టీచర్ "మూడు మూళ్ళు ఆరు కాదురా వెధవా..."

"సాయంత్రం మా పెరట్లో కాసిన అనపకాయ పట్టుకొస్తా మాస్టారూ...' మెల్లగా చెప్పాడు విద్యార్థి.

"నీ జవాబు కరక్టే! కూర్చో కూర్చో!"

"...!?"

—సోని (విశాఖపట్నం)

మోసుకెళ్ళేలా ఉన్నావు''.

సుమతి అన్నయ్య మాటలు పట్టించుకో కుండా బంగారం అమ్మేసింది. వచ్చిన డబ్బు ఆఫీసర్ల చేతులు తడపడానికి సరిపోయింది. ఫైలుమీద అందరూ అనుకూలంగా రాశారు బమ్మిని తిమ్మి, తిమ్మిని బమ్మి చెయ్యడం ప్రభుత్వోద్యోగులకి వెన్నతో పెట్టిన విద్య. ఫైలు మంత్రిగారి దగ్గరకు వెళ్ళింది.

మంత్రిగారడిగిన లెక్కకి గుండె బేజార యింది సుమతికి "అదేమిటమ్మా బంగారు బాతులాంటి ఉద్యోగం మీ ఆయనది ఆలోచి స్తే ఎలా'' అన్నాడు పైరవీ చేసే ఆయన. సుమతి నాలుగెకరాల భూమీ అమ్మేసింది.

మానవతా దృక్పథంతో కేసుని చూశా మనీ, కళ్యాణ్‌కి తిరిగి పదవీ బాధ్యత లివ్వాలనీ మంత్రిగారు ఆదేశాలు జారీ చేశారు.

కళ్యాణ్ ఎగిరి గంతేశాడు. ఏడేళ్ళుగా ఉన్న మానసిక రుగ్మత నిముషంలోనే ఎగిరిపోయింది.

"చూశావా సుమతీ న్యాయానికి చెప్పి వు. న్యాయం జయించింది. అంతా కక్షకట్టి నామీదకు నేరం తోసి నన్ను సస్పెండు చేయించారు. నామార్గం రైటే. లేకపోతే నేను జయిస్తానా? నాకు తిరిగి ఉద్యోగం వస్తుందా? ఇక చూసుకో దున్నేస్తాను. రెః రెండేళ్ళలో పోయిందంతా రాబట్టాలి''.

సుమతి ప్రమాన్పడి పోయింది. ఆమెకు ఈ ఎదురు చూడని సంఘటన గుండెల్లో గునపంలా గుచ్చుకుంది. ఇకమీదట భర్త న్యాయమార్గంలో వెడతాడనుకుంది. కానీ ఇలా ఊహించలేదు.

"ఏం చేసింది తను. అజ్ఞానంలోనే కాని పాపంలో భాగమున్నట్లేదన్న వాల్మీకి భార్యది తప్పని నమ్మింది. భర్త ఆప్యాయంలో తను పాలుపంచుకుంది. ఏమిటి తను ఇదివరకు సాధించింది? పాపం పట్టని వాల్మీకి భార్య లోకానికి ఒక మహర్షిని, ఒక ఉత్తమ కావ్యకర్తనూ అందించింది. పాపం పంచుకుని తను ఒక అవినీతి పరుణ్ణి అందించింది. ఎవరి మార్గం రైటు? ఏది ప్రాశస్త్యం?''

